డీజీపీగారూ... దృష్టి పెట్టాలి మీరు

ఐదేళ్లలో టీడీపీ నేతలపై అసంఖ్యాక తప్పుడు కేసులు - వైసీపీ నేతల ప్రమేయమున్న కేసుల్లో సాగని దర్యాప్తు

గడచిన ఐదేళ్ల పాటు జిల్లావ్యాప్తంగా టీడీపీ, జనసేన పార్టీల నాయకులపై వైసీపీ నేతల ఒత్తిడితో పోలీసులు అసంఖ్యాకంగా తప్పుడు కేసులు నమోదు చేశారు.ప్రభుత్వానికి, వైసీపీ నేతలకు వ్యతిరేకంగా నోరెత్తిన, రోడ్డెక్కిన వారందరిపైనా క్రిమినల్ కేసులు బనాయించారు. సామాన్య కార్యకర్తల నుంచీ నియోజకవర్గాల ఇంఛార్జుల వరకూ అన్ని స్థాయుల్లోనూ టీడీపీ, జనసేన క్యాడర్ వేధింపులను, తప్పుడు కేసులను ఎదుర్కొంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో అన్యాయంగా కేసుల పాలైన తమకు న్యాయం చేయాలని టీడీపీ, జనసేన నేతలు కోరుతున్నారు.డీజీపీ ద్వారకా తిరుమల రావు తిరుపతికి వచ్చిన నేపథ్యంలో నాటి అధికార పార్టీ నేతలు, పోలీసుల చేతిలో బాధితులు ఎదుర్కొన్న వేధింపులు, కేసులకు సంబంధించి కొన్ని ఆయన దృష్టికి తీసుకుపోయే ప్రయత్నమిది....

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నానీపై దాడి కేసులోనూ సక్రమంగా సాగని దర్యాప్తు

పోలింగు మరుసటిరోజు చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై తిరుపతిలోని మహిళా వర్సిటీ ఆవరణలో జరిగిన హత్యాయత్నానికి సంబంధించిన కేసులో దర్యాప్తు సక్రమంగా సాగడం లేదు. ప్రధాన పార్టీ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడం, అది కూడా ఈవీఎంలు భద్రపరిచిన మహిళా వర్సిటీ ఆవరణలో జరగడం ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపివేసింది.జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగాల వైఫల్యాన్ని బట్టబయలు చేసిన ఈ ఘటనలో తర్వాత కూడా దర్యాప్తు సజావుగా సాగలేదు. సరికదా టీడీపీ నేతలపై ఎదురు కేసులు బనాయించారు. నానీపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వారంటూ పోలీసులు అరెస్టు చేసిన వారిలో పలువురు అమాయకులని, ఘటనతో ఎలాంటి సంబంధం లేనివారన్న ఆరోపణలున్నాయి. కేవలం ఘటన తీవ్రత తగ్గించేందుకు అప్పటికప్పుడు కేసుతో సంబంధం లేని వారిని నిందితులుగా చూపి అరెస్టు చేశారన్న ఆరోపణలున్నాయి. కీలక నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని విచారించడంతో పాటు కేసును సైంటిఫిక్‌గా దర్యాప్తు సాగిస్తే హత్యాయత్నం చేయించిన కీలక వ్యక్తులు ఎవరన్నది తేలుతుంది. అయితే పోలీసులు ఆ దిశగా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడం లేదు.తిరుపతి పర్యటనలో వున్న డీజీపీ ద్వారకా తిరుమల రావు వీటన్నింటిపై దృష్టి సారించి జిల్లా పోలీసు యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయాల్సిన అవసరముంది.


మే 14న మహిళావర్సిటీ వద్ద వైసీపీ శ్రేణుల దాడితో గాయపడ్డ నానికి సపర్యలు

వెంకటగిరిలో రామకృష్ణపై నాలుగు కేసులు

వెంకటగిరి టీడీపీ ఇంచార్జి కురుగొండ్ల రామకృష్ణ, ఇదే నియోజకవర్గానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్‌లపై నాలుగు కేసులు బనాయించారు. 2021 డిసెంబరు 1న కరోనా నిబంధనలను నిరసిస్తూ ధర్నా చేసినందుకు వీరిపై కేసు నమోదు చేయగా 2021 డిసెంబరు 6న అమరావతి రైతుల పాదయాత్ర సందర్భంగానూ నిబంధనలు ఉల్లంఘించారంటూ కేసు పెట్టారు. 2023 ఆగస్టు 4న అంగళ్ళులో చంద్రబాబుపై దాడికి నిరసనగా జగన్ దిష్టిబొమ్మ కాల్చినందుకు కూడా వీరిద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి 19న రా కదలిరా చంద్రబాబు పర్యటనలో కూడా నిబంధనల ఉల్లంఘన పేరుతో క్రిమినల్ కేసు రిజిస్టర్ చేశారు.

సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేశారంటూ...

వెంకటగిరి నియోజకవర్గంలో తెలుగు యువత కార్యదర్శి ఆవుల మురళిపై పోలీసులు కేసు బనాయించారు. 2023 ఏప్రిల్‌లో సోషల్ మీడియాలో వైసీపీకి వ్యతిరేకంగా ఒక పోస్టును షేర్ చేయడమే నేరంగా అదే నెల 5న క్రైమ్ నంబరు 35-2023. పేరిట కేసు నమోదు చేశారు.

చిల్లకూరులో టీడీపీ నేతపై రెండు కేసులు

చిల్లకూరు మండలం తిప్పగుంట పాలేనికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డిపై ఓ వ్యక్తిని బెదిరించాడని కేసు నమోదైంది. అలాగే ఓ మహిళను కులం పేరిట దూషించారంటూ మరో కేసు కూడా నమోదైంది. ఈ రెండు కేసులు కూడా 2021 మార్చిలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో వెంకటేశ్వర్లు రెడ్డి టీడీపీ వైపు చురుగ్గా పనిచేస్తున్న సందర్భంలో అధికార పార్టీ నేతల ఒత్తిడితో నమోదయ్యాయి.

టీడీపీ నేతపై తల్లీ, తోబుట్టువులతోనే కేసు

బాలాయపల్లి మండలం గాజులపల్లిలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవర్ధనకు తల్లి, తోబుట్టువులతో కుటుంబ కలహాలున్నాయి. దాన్ని ఆసరాగా తీసుకుని 2023లో అధికార పార్టీ నేతలు అతనికి వ్యతిరేకంగా కుటుంబ సభ్యులను ఉసిగొల్పి తప్పుడు కేసు నమోదు చేయించారు.


మహిళా వర్సిటీ వద్ద వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడ్డ నానీ గన్‌మెన్ ధరణి (ఫైల్‌ఫొటో)

వైసీపీ నేతల ప్రమేయమున్న కీలక కేసుల్లో సాగని దర్యాప్తు

జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులను, కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధించిన పోలీసులు అదే సమయంలో వైసీపీ నేతల ప్రమేయమున్న కీలక కేసుల్లో మాత్రం దర్యాప్తు సక్రమంగా చేపట్టలేదు. సాగదీత ధోరణితో వ్యవహరించారు. ఉదాహరణకు శ్రీకాళహస్తి ఎన్టీయార్ కూడలిలో 2022 జూన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు వాహనంపై వైసీపీ నాయకులు రాళ్ళతో దాడి చేశారు. వాహనం నుంచీ కిందకు దిగిన చలపతి నాయుడుపై వైసీపీ నేత, అప్పటి ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జై శ్యామ్ దాడి చేసి గాయపరిచాడు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయలేదు. ఆ కేసు దర్యాప్తు అతీగతీ లేకుండా పోయింది.

ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ కేసులోనూ సాగదీతే!

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2021 ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారీ ఎత్తున ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన సంగతి తెలిసిందే. మున్సిపల్ కార్యాలయం, తిరుపతి అర్బన్ తహసిల్దారు కార్యాలయాలు వేదికగా ఈ అక్రమాలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ ముఖ్యనేతల ఆదేశాలతో మున్సిపల్, రెవిన్యూ అధికారులు, ఉద్యోగులు 35 వేల ఎపిక్ కార్డులను అక్రమంగా డౌన్ లోడ్ చేసినట్టు సాక్షాత్తూ ఎన్నికల కమిషన్ పరిశీలనలో వెల్లడైంది. ఈ ఘటనకు బాధ్యులుగా అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరిశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, అర్బన్ తహసిల్దారు, డిప్యూటీ తహసిల్దార్‌లను సస్పెండ్ చేశారు. పోలింగ్ రోజు విపక్షాలు చేసిన ఫిర్యాదులపై బోగస్ ఓటర్ల విషయంలో తగిన విధంగా కేసులు పెట్టలేదని, పెట్టిన కేసుల్లో దర్యాప్తు సక్రమంగా చేపట్టలేదని ఆరోపిస్తూ ఇద్దరు సీఐలు, ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్‌లను కూడా సస్పెండ్ చేశారు. దీనిపై ఈసీ ఆదేశాలతో పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ఆదేశాలతోనే ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేశారన్న ఆరోపణలు వున్నాయి. వ్యవహారం జరిగిన కంప్యూటర్ల హార్డ్ డిస్కులను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచీ నివేదిక కూడా వచ్చినట్టు చెబుతున్నారు. అయితే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. వేగంగా, సక్రమంగా దర్యాప్తు జరిగివుంటే ఇప్పటికే తిరుపతి వైసీపీ కీలక నేతలు నిందితులుగా మారి వుండేవారని, అయితే వారిని కాపాడేందుకే పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టకుండా కాలక్షేపం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కబ్జా భూమిని పరిశీలిస్తే కూడా..

రేణిగుంట మండలం అన్నాసామిపల్లిలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో భూములు పరిశీలించేందుకు టీడీపీ నేతలతో కలసి వెళ్ళిన శ్రీకాళహస్తి టీడీపీ ఇంఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డిపై కేసు నమోదైంది. అనుమతి లేకుండా భూమిలో ప్రవేశించి మొక్కలు పెరికేశారని, సెక్యూరిటీ గార్డును బెదిరించారంటూ పోలీసులు కేసు పెట్టారు. అదొక్కటే కాదు వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనగా బైఠాయించిన బొజ్జల సుధీర్‌రెడ్డిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు పెట్టారు.శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో కొంతమంది టీడీపీ సానుభూతిపరులను వేధిస్తున్నారని సీఐని సుధీర్‌రెడ్డి అడిగినందుకు దుర్భాషలాడడంతో శ్రీకాళహస్తి రూరల్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.దీంతో స్టేషన్‌పై, పోలీసులపై దాడికి ప్రయత్నించినట్లు ఓ కేసు , మరో అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

వదిలిపెట్టాలని వాదిస్తే దాడి కేసు

చంద్రబాబు అరెస్టు సందర్భంగా టీడీపీ నాయకులను ముందు జాగ్రత్త చర్యగా శ్రీకాళహస్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాత్రయినా విడిచిపెట్టకపోవడంతో టీడీపీ నాయకులు తమను ఎందుకు వదిలిపెట్టడం లేదంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో తమపై దాడి చేశారంటూ పోలీసులు ఎనిమిదిమంది టీడీపీ నాయకులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.


శ్రీకాళహస్తి రూరల్ స్టేషన్ ఎదుట బొజ్జల సుధీర్‌రెడ్డి ధర్నా (ఫైల్‌ఫొటో)

పోలింగ్ బూత్‌లో అక్రమ ప్రవేశాన్ని అడ్డుకున్నందుకు...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏర్పేడు పోలింగ్ బూతుల్లోకి ప్రవేశించిన వైసీపీ నాయకులను అడ్డుకున్న టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఘటన జరిగినపుడు అక్కడ లేని వారిపైనా కేసులు పెట్టారు.

లోకేశ్ స్వాగత బ్యానర్లు కట్టినందుకు కేసు

నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఏర్పేడు మండలంలో బ్యానర్లు, పోస్టర్లు వేసిన పలువురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

సమన్యాయం.. మన విధానం

బాధితులకు అండగా నిలవండన్న డీజీపీ ద్వారకా తిరుమలరావు


తిరుపతిలో డీఐజీ, ఎస్పీలతో సమావేశమైన డీజీపీ

తిరుపతి (నేరవిభాగం), జూలై 13 : 'పోలీసుల పని విధానం మారాలి. గతంలో చాలామందిపై ఫిర్యాదులొచ్చాయి. మానవ హక్కులు ఉల్లంఘించి, చట్టాలను చేతిలోకి తీసుకుని పనిచేసిన వారు ఇక మారాలి. లేకుంటే వారు తప్పుకోవచ్చు...మళ్ళీ మళ్ళీ అదే విధానాలు అమలుచేయాలంటే నా దగ్గర కుదరదు...ఎవరు తప్పు చేసినా అందరికీ సమన్యాయం అనే విధానం మరచిపోవద్దు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. శాంతి భద్రతలు, నేరాల అదుపు, ప్రస్తుతం పోలీసు అధికారుల పనితీరు వంటి అంశాలపై రాయలసీమ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, డీఐజీ షెముషి బాజ్పేయితో శనివారం తిరుపతిలో డీజీపీ సమీక్షించారు. ప్రధానంగా కొత్త ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి బాధితులకు తక్షణం న్యాయం చేయాలని ఆదేశించారు.చట్టాలను చేతిలోకి తీసుకుని మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే మాత్రం ఎవరైనా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బాధితులు, ఫిర్యాదుదారులు స్టేషన్లకు వచ్చినప్పుడు వారితో నవ్వుతూ, స్నేహపూర్వక వాతావరణంతో మాట్లాడాలని కోరారు. తిరుపతిలో ఎన్నికలకు ముందు, కౌంటింగ్ అనంతరం జరిగిన కొన్ని కేసులను ఉదహరిస్తూ ఇలాంటి తప్పుడు కేసులు పెడితే మాత్రం సంబంధిత అధికారులపై చర్యలు వుంటాయన్నారు. ప్రస్తుతం తిరుపతిలో నేరాలు, ఎర్రచందనం అక్రమ రవాణా కొంతవరకు తగ్గుముఖం పట్టాయంటూ ఎస్పీ హర్షవర్ధన రాజు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న విధానంపై డీజీపీ అభినందించారు.తిరుపతిలో గంజాయి విక్రయాలు ఎక్కువగా వున్నాయని, వాటిని అరికట్టాలన్నారు.గంజాయి సేకరణ,రవాణా, విక్రయాలపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాత కేసులు, ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు, గత ప్రభుత్వంలో అధికారపార్టీతో అంటకాగిన అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు.ఎస్పీలు హర్షవర్ధన రాజు, కృష్ణారావు, కృష్ణకాంత్, సిద్ధార్థకౌశల్, మాధవ రెడ్డి, మణికంఠ చందోలు, గౌతమి శాలి, తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ పాల్గొన్నారు.

ఎస్పీగా సుబ్బరాయుడు

హర్షవర్ధన రాజు కడపకు బదిలీ


ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 13 : తిరుపతి జిల్లాకు ఎస్పీగా ఎల్. సుబ్బరాయుడు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా బండమీదపల్లెకు చెందిన సుబ్బరాయుడు 2007లో డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, ఏలూరుల్లో డీఎస్పీగా పనిచేసిన తర్వాత నిజామాబాద్, అనంతపురం ,కరీంనగర్ జిల్లాల్లో అదనపు ఎస్పీగా పనిచేశారు. 2013లో ఐపీఎస్ హోదా లభించింది. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి గవర్నర్ వద్ద సీఎస్ఓగా పనిచేశారు.2014 నుంచి 2019 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసి మంచి అనుభవం గడించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక తెలంగాణా క్యాడర్‌కు బదిలీపై వెళ్ళారు. అక్కడ సీఐడీలో ఎస్పీగా పనిచేశారు.2023లో కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఆయన్ను ఎన్నికల సమయంలో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆయన్ను హైదరాబాదు ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. అక్కడ పనిచేస్తూ ఏపీకి డిప్యుటేషన్‌పై రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఏపీకి ఇంటర్ క్యాడర్ బదిలీపై వచ్చిన సుబ్బరాయుడు తాజాగా తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమితులయ్యారు.అలాగే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బరాయుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఎస్పీ హర్షవర్ధన రాజును కడపకు బదిలీ చేశారు.ఆయన ఇక్కడ పని చేసిన రెండు నెలల వ్యవధిలోనే పోలీసు శాఖను గాడిలో పెట్టడానికి కృషి చేశారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యసేవనాన్ని అరికట్టేందుకు ప్రయత్నించారు.

టీటీడీ సీవీఎస్వో బదిలీ


నరసింహకిషోర్

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి(సీవీఎస్వో) డి.నరసింహకిషోర్ బదిలీ అయ్యారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన బాధ్యతలు స్వీకరించిన నరసింహకిషోర్ రెండేళ్ల మూడునెలల పాటు టీటీడీలో పనిచేశారు.తూర్పు గోదావరి జిల్లాకు ఆయన్ను బదిలీ చేశారు. అయితే ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. తిరుమలలో భద్రతావైఫల్యంపై ఈ రెండేళ్లలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఓ డ్రోన్ కెమెరా నేరుగా ఆలయంపైకే వెళ్లడం కలకలం సృష్టించింది. గత ఏడాది జనవరిలో అఖిలాండం నుంచి శ్రీవారి ఆనందనిలయం వరకు తీసిన డ్రోన్ విజువల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. సర్వే కోసమని ఓ సంస్థకు అనుమతి ఇచ్చి పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ఆ సంస్థ ఉద్యోగి డ్రోన్ ద్వారా వీడియో తీసి నెట్‌లో అప్‌లోడ్ చేశాడు. అలాగే గత ఏడాది మే నెలలో ఓ యువకుడు భద్రతాతనిఖీలు దాటుకుని ఆలయంలోకి వెళ్లి ఆనంద నిలయం వీడియోను తీసి సోషల్‌మీడియాలో పెట్టాడు. ఈ ఏడాది కూడా ఓ జంట డ్రోన్ కెమెరాలతో తిరుమలకు రావడమే కాకుండా ఘాట్‌రోడ్డులో వీడియోను తీయడం కూడా విమర్శలకు దారితీసింది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరుమలలో గంజాయి పట్టుబడటం కూడా అందరినీ ఆశ్చర్యపరిచింది.తిరుమలలో నిషేధించిన మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు కూడా తరచూ దర్శనమిచ్చాయి. ఈ పరిస్థితుల్లో తిరుమలలో భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఎవరిని సీవీఎస్వోగా నియమిస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

జగనన్న పట్టాలు అమ్మేశారు

స్థలం చూపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు


ఫోర్జరీ పట్టాలను చూపిస్తున్న బాధిత మహిళలు

రేణిగుంట, జూలై 13: దాదాపు 200 జగనన్న పట్టాలను విక్రయించిన వైనం శనివారం బహిర్గతమైంది. బాధితుల ఫిర్యాదుతో గుట్టురట్టయింది. గత ప్రభుత్వ హయాంలో రేణిగుంట మండలంలోని లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలను అందజేసిన విషయం తెలిసిందే. గతేడాది జూన్‌లో జరిగినీ వ్యవహారంలో కంప్యూటర్ ఆపరేటర్, వలంటీర్లు పట్టాల అమ్మకంలో చేతివాటం చూపినట్టు భావిస్తున్నారు. వివరాలివి. అప్పటి తహసీల్దారు శివప్రసాద్ కార్యాలయంలో ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన శశికళ మోసంలో కీలకపాత్ర పోషించారు. రికార్డు రూమ్‌లో సీజ్ చేసిన పట్టాల తయారీలో ఆమెతోపాటు కిందిస్థాయి సిబ్బంది చేతులు కలిపారని సమాచారం. అమాయకులైన కొందరు వీరి ఉచ్చులో పడ్డారు. కొనుగోలుదారుల ఫోటో అంటించి పట్టాలపై తహసీల్దార్ సీల్ వీరే వేసేశారు. అధికారుల సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. అనుమానం తలెత్తకుండా ఫింగర్ ప్రింట్ తీసుకున్నారు. మూడు నెలల్లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదవుతాయని నమ్మబలికారు. వివిధ ప్రాంతాలకు చెందిన 200మంది రూ.1.10లక్షల వంతున పట్టాలు కొనుగోలుచేశారు. ఈవిషయం గమనించి గతేడాది ఆగస్టులో కంప్యూటర్ ఆపరేటర్ శశికళను విధుల నుంచి తొలగించారు. అయితే అప్పటినుంచీ బాధితులు ఆపరేటర్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. శశికళ కుంటిసాకులు చెబుతూ తప్పించుకుని తిరుగుతోంది. అనుమానం వచ్చిన కొందరు కొనుగోలుదారులు తాజాగా ఆరా తీయడంతో వాస్తవాలు బయటపడ్డాయి. ఈ మోసంపై లలిత, రాణి, సురేష్, మునీశ్వర్, మునస్వామి తదితరులు రేణిగుంట అర్బన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశామన్నారు. గతేడాది కంప్యూటర్ ఆపరేటర్ శశికళను విధుల నుంచి తొలగించారు. ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారని సమాచారం. కలెక్టర్ విచారించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న
పార్వేట ఉత్సవం



చంద్రగిరి, జూలై 13: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం శనివారం శ్రీవారిమెట్టు సమీంపలో వైభవంగా జరిగింది. సాక్షాత్కార వైభవోత్సవాలు ముగిసిన మరుసటి రోజున పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా కల్యాణ వెంకన్న ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి.. నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. 11 గంటలకు శ్రీవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేర్చారు. అక్కడ ఉత్సవం వేడుకగా జరిగింది. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారి తరఫున అర్చకులు మూడుసార్లు బళ్లెం ప్రయోగించారు. ఆస్థానం నిర్వహించాక ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించగా, భజన బృందాల భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదార్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడితోటలో పురాతన కట్టడాల రాళ్లు

చంద్రగిరి కోట ప్రహరీ ఆవరణలో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ వైనం - పనులు ఆపించిన ఆర్కియాలజీ అధికారులు

చంద్రగిరి, జూలై 13: చంద్రగరి కోట ప్రహరీ ఆవరణలోని ఓ మామిడితోటలో పురాతన కట్టడాల రాళ్లు బయటపడ్డాయి. చంద్రగిరికి చెందిన ఓ రైతు తన మామిడి తోటను ఎక్స్‌కవేటర్ పెట్టి చదును చేస్తుండగా ఈ రాళ్లు బయటపడ్డాయి. వాటిని ఆయన కోట ప్రహరీ వెలుపల పడేశాడు. సమాచారం అందుకున్న ఆర్కియాలజీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను ఆపించారు. రాళ్లను పరిశీలించారు. కాగా, ఆర్కియాలజీ నిబంధనల ప్రకారం కోట ప్రహరీ చుట్టుపక్కల 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి తవ్వకాలు, పనులు చేపట్టకూడదు. అయితే కోట ప్రహరీ ఆవరణలోనే యథేచ్ఛగా యంత్రాలతో పనులు చేయడం, కట్టడాల నిర్మాణం జరుగుతున్నాయి. ఇకనైనా వీటిని అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





మామిడి తోటను చదును చేస్తుండగా బయటపడ్డ రాళ్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

చంద్రగిరి కోట ప్రహరీ ఆవరణలో చంద్రగిరి ముస్లిం రైతుకు చెందిన ఓ మామి డి తోటలో చెట్లు నాటుకోవడానికి అనుమతి ఉంది. తోటలో చదును చేస్తుండగా పురాతన కట్టడాల రాళ్లు బయటపడ్డాయి.మాకు సమాచారం అందగానే పనులు ఆపించాం. ఈవిషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి.. తదుపరి చర్యలు తీసుకుంటాం.

- ప్రవీణ్ కుమార్, సీఏ (కన్జర్వేటర్ అసిస్టెంట్), చంద్రగిరి కోట

తిరుచ్చిపై సూర్యనారాయణస్వామి



తిరుచానూరు, జూలై 13: తిరుచానూరులో కొలువై ఉన్న సూర్యనారాయణస్వామికి శనివారం వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఏఈవో రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలగుర్రప్ప స్వామి ఉత్సవాల్లో పులివర్తి నాని



పులివర్తి నానికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

భాకరాపేట, జూలై 13: చిన్నగొట్టిగల్లు మండలం లంకిపల్లెవారిపల్లెలో జరుగుతున్న బాలగుర్రప్ప స్వామి ఉత్సవాల్లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలగుర్రప్ప స్వామి, ఎల్లమ్మ, అంకమ్మ, వేంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహాలకు ఎమ్మెల్యే పూజలు చేశారు. సిద్ధపూజలోనూ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్వాగతం



రేణిగుంట, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, నగరపాలక సంస్థ కమిషర్ అదితిసింగ్, డీఆర్వో పెంచల కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రబాబునాయుడు, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం నీరబ్‌కుమార్ ప్రసాద్ రోడ్డు మార్గాన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ధూమ్రవారాహి దేవిగా అమ్మవారు



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, జూలై 12: రాయలచెరువు కట్టపై ఉన్న శ్రీశక్తి పీఠం వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు ధూమ్రవారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు ఉదయం తొమ్మిది గంటలకు వేద మంత్రోచ్ఛారణల మధ్య వారాహి హోమాన్ని ప్రారంభించి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ కన్నులపండువగా జరిగింది. రాత్రి కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

కొత్తనెన్నూరు రోడ్డుకు మరమ్మతులు



రామచంద్రాపురం, జూలై 13: రామచంద్రాపురం - పూడి మార్గంలో నెన్నూరు నుంచి కొత్త నెన్నూరు వెళ్లే రోడ్డుకు శనివారం ఉదయం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు లీలా మోహన్‌నాయుడు తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. కొత్త నెన్నూరు ఎస్టీకాలనీ నుంచి గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చెరువు, గుట్ట ప్రాంతం నుంచి గ్రావెల్‌ను అక్రమంగా టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఈ రోడ్డు మార్గంలో తరలించేవారు. దీంతో దారంతా గుంతలమయంగా మారింది. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో ఆరి లీలామహన్‌నాయుడు శనివారం మట్టిని తొలగించి.. గుంతలను గ్రావెల్‌తో పూడ్చారు. అలాగే చెత్తను తొలగించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

20 రోజులైనా పరిష్కారం కాని సమస్యలు

చంద్రగిరి, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని గత నెల 24వ తేదీన చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా హాజరై స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో పేర్కొన్న సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మొత్తం 68 అర్జీలు వచ్చాయి. వీటిల్లో విద్యుత్, ఆర్‌అండ్‌బీ, విద్య, వికలాంగుల, వ్యవసాయ, వెటర్నరీ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున, పింఛన్లపై 11, రెవెన్యూకు 33, ఆర్టీసీకి 2, సీసీ రోడ్లకు, తాగునీటికి నాలుగు చొప్పున, గ్రామ పంచాయతీకి 8 ఉన్నాయి. విద్యుత్‌కు సంబంధించిన సమస్య పరిష్కరించారు. ఇక దానామూర్తపల్లె వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి వద్ద వర్షపు నీరు రోడ్డుపైనే నిల్వ ఉంటూ, పంటపొలాల్లోకి వెళుతోందని.. వీటిని స్వర్ణముఖినదికి మళ్లించాలని ఆర్‌అండ్‌బీ శాఖను కోరగా, ఇది తమ పరిధి కాదని జాతీయ రహదారుల అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఇక రెవెన్యూ సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించినట్లు దాఖలాలు లేవు. విద్యకు సంబంధించి ఎ.రంగంపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే వర్కర్లను తొలగించాలని కోరారు. దీనిపై ఎంఈవో త్వరలోనే తల్లితండ్రుల సమావేశం నిర్వహించి, తొలగిస్తామన్నారు. పెన్షన్లకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం వెబ్‌సైట్ ఓపెన్ చేయలేదని తెలిపారు. మిగిలిన సమస్యలపైనా స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయంలో విరిగిన చెట్టుకొమ్మ
తప్పిన ప్రమాదం

శ్రీకాళహస్తి, జూలై 13: ముక్కంటి ఆలయంలోని భారీ వృక్షం నుంచి చెట్టుకొమ్మ విరిగిపడింది. ఆలయం లోపల చుక్కాని ఉత్సవం నిర్వహించే ప్రదేశంలో ప్రాకారం వద్ద భారీ చెట్టు ఉంది. శనివారం వేకువజామున హోరుగాలి, జోరువానతో భారీ కొమ్మ విరిగి ఆలయం వెలుపల వైపున పార్కింగ్ ప్రదేశంలో పడింది. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో 8మంది అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 13: ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో ఒక యువతి సహా మరో ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... తిరుపతికి చెందిన కృష్ణమూర్తి ఎన్‌ఆర్‌ఐ. ప్రైవేటు సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఆయనకు తిరుపతికి చెందిన ఆయేషా అనే యువతితో పరిచయం ఏర్పడింది. కొందరు మహిళలను సభ్యులుగా చేర్పిస్తామని ఆయేషా చెప్పడంతో కృష్ణమూర్తి ఆమెతో పాటు ఈనెల 3వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు వెళ్లారు. అక్కడ ఆయేషా, మరి కొందరు యువకులతో కలిసి కృష్ణమూర్తి కంట్లో కారం కొట్టి కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. అతని వద్ద నుంచి రూ.5లక్షల నగదు వసూలు చేశారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి రూ.6కోట్లు డిమాండ్ చేశారు. డబ్బు రాకపోవడంతో మరుసటిరోజు 4వ తేదీన కృష్ణమూర్తిని రాజీవ్‌నగర్‌లో వదలి వెళ్లిపోయారు. 8వ తేదీన కృష్ణమూర్తి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఆయేషానే కిడ్నాప్ పథకం రచించినట్లుగా నిర్ధారించుకుని ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగస్వాములు అయిన న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్డపూడి దాము, బంజల లోకేష్, పిడతల గిరి, యాసారపు భార్గవ్, వెట్టి అనిల్ అనే యువకులను శనివారం అరెస్టు చేశారు. ఆయేషా పాటు మొత్తం 8మంది నిందితులను రిమాండ్‌కు తరలించనట్లు సీఐ రారాజు తెలిపారు.

ఐఐటీ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయండి



ఐఐటీ డైరెక్టర్‌తో సమీక్షిస్తున్న కలెక్టర్

ఏర్పేడు, జూలై 13: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శనివారం ఆయన జేసీ ధ్యానచంద్రతో కలిసి ఐఐటీని సందర్శించారు. పెండింగ్ పనుల వివరాలు తెలుసుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ఐఐటీ క్యాంపస్ పురోగతి గురించి వివరించారు. భూ సంబంధిత, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో ఐఐటీ రిజిస్ట్రార్ చమన్‌మెహతా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయ సమస్యలపై సమీక్ష

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయానికి సంబంధించి పలు అంశాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. శనివారం ఆయన జేసీ ధ్యానచంద్రతో కలిసి విమానాశ్రయాన్ని సందర్శించారు. భూ సమస్యలు, ఎలక్ట్రిక్ లైన్ తదితర అంశాలపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో అధికారులతో చర్చించారు. పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, కేఈఐ సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొరికితేనే కేసులు
రేషన్ దుకాణాలపై కొరవడిన నిఘా

తిరుపతి(నేరవిభాగం), జూలై 13: కొన్నేళ్లుగా రేషన్ దుకాణాలపై నిఘా అధికారుల కొరవడింది. దీనివల్ల దొరికితేనే కేసులు అన్న చందంగా పరిస్థితి తయారైందన్న విమర్శలొస్తున్నాయి. కొన్నిచోట్ల డీలర్లు నేరుగా కార్డుదారుల నుంచే బియ్యం కిలో రూ.7-8 లెక్కన కొనుగోలు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు రేషన్ దుకాణాల్లో స్టాకు రిజిస్టరు, సేల్స్ రిజిస్టర్‌కు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు సమాచారం. దీనిపై తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాల శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్, పోలీసులకు సమాచారం ఇస్తేనే వచ్చి పట్టుకుని 6-ఏ కేసులు నమోదు చేస్తున్నారు.

రెండేళ్లలో నమోదైన కేసులిలా..

2022-23లో 6-ఏ కేసులు కేవలం 25 మాత్రమే నమోదు చేసి 60లక్షల క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. 2023-24లో ఈ కేసులు మరింత తగ్గిపోయాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరు నెలల కాలంలో ఐదు కేసులు మాత్రం నమోదు చేశారు.

డీలర్లపై చర్యలు తీసుకుంటాం

కార్డుదారుల నుంచి రేషన్ షాపు డీలర్లు బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలో రేషన్ షాపులపై దాడులు నిర్వహించి స్టాకు, సేల్స్ రిజిస్టర్లు పరిశీలిస్తాం.

- రఘువీరా, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి





తిరుమలలో వాహనాల రద్దీ - ఆక్టోపస్ భవనం వద్ద క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

తిరుమల కిటకిట

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది.సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వోతో పాటు సిఫార్సు లేఖలపై గదులు ఇచ్చే పద్మావతి, ఎంబీసీ34, టీబీ కౌంటర్లు కూడా భక్తుల క్యూలైన్లతో దర్శనమిచ్చాయి. అలాగే తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా మారాయి. స్లాట్ దర్శన భక్తులకు కూడా 2 నుంచి 3 గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు కొంతమంది భక్తులు క్యూలైన్లలోకి వెళ్లేందుకు గేట్లు దూకుతూ కనిపించారు. మరికొన్ని చోట్ల అధిక సమయం క్యూలో ఉండలేక బయటకి వచ్చేశారు. ఇక, తిరుమల క్షేత్రం మొత్తం వాహనాలతో రద్దీగా మారిపోయింది. అక్కడక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.30 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది.

వ్యర్థాలతో క్యూలైన్లు


సర్వదర్శన క్యూలైన్ల వ్యర్థాలతో దర్శనమిచ్చాయి. క్యూలైన్ల వద్ద పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలంటూ టీటీడీ ఈవో శ్యామలరావు ఇప్పటికే హెల్త్ విభాగం అధికారులను ఆదేశించినప్పటికీ క్యూలైన్ల వద్ద అపరిశుభ్రతే కనిపించింది. భక్తుల తినిపడేసిన అన్నప్రసాద, నీటి కప్పులు క్యూలైన్ల పక్కనే దర్శనమిచ్చాయి. మరోవైపు అన్నప్రసాదాలు వడ్డించేవారి కొరత కూడా స్పష్టంగా కనిపించింది. అన్నప్రసాదాల పాత్రలు క్యూలైన్ల పక్కనే ఉన్నప్పటికీ సిబ్బంది కనిపించకపోవడంతో భక్తులు కూడా క్యూలైన్‌లో మౌనంగా ముందుకెళ్లిపోయారు.



మంచుకొండల్లో పలమనేరు ఖ్యాతి

సైకిల్లో లడఖ్ చేరుకున్న యువకుడు

సేవ్ ట్రీ..సేవ్ ఫారెస్టు నినాదంతో 32 రోజుల యాత్ర



లడఖ్ చేరుకున్న బషీర్



మంచుకొండ వద్ద..

సైకిల్‌పై వెళ్తున్న బషీర్

పలమనేరు, జూలై13 : పలమనేరు యువకుడు 32 రోజుల పాటు సైకిల్‌లో ప్రయాణించి లడఖ్ సమీపంలోని మంచు కొండలకు చేరుకుని అరుదైన రికార్డు సృష్టించాడు. చెట్లను, అడవులను ఇష్టానుసారం నాశనం చేస్తుండడంతో దానివల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో పాతపేట శ్రీనగర్ కాలనీకి చెందిన మస్తాన్ బాషా కుమారుడు ఎస్.బషీర్ భావించాడు. ఈ మేరకు 32 రోజుల క్రితం పలమనేరు నుంచి సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ నెల 12వ తేదీ లడఖ్ చేరుకుని, అక్కడి మంచుకొండలను అధిరోహించాడు. తాను అనుకున్న లక్ష్యం పూర్తయిందని, ఇందులో స్నేహితులు, సన్నిహితులు ఆర్థికంగా సాయపడ్డారని బషీర్ తెలిపారు. జిల్లా నుంచి ఈ మంచుకొండలు ఎక్కిన మొదటి వ్యక్తిగా కీర్తి గడించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈనెల 17వ తేదీన రైలులో జిల్లాకు చేరుకుని కలెక్టర్‌ను కలుస్తానని ఆంధ్రజ్యోతితో చెప్పారు.

చంద్రబాబుకు సింగంశెట్టి కృతజ్ఞతలు



తిరుపతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి రూ.250 కోట్ల నిధులు విడుదల చేసిన సందర్భంగా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య శనివారం కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. నిధుల విడుదల సందర్భంగా రాష్ట్రంలోని సర్పంచులంతా మీకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నారని చెప్పారు.

పొలంగట్టుపై ఆకులను
తాళింపుగా చేసుకుని...

- **ఆహారం వికటించడంతో నలుగురికి అస్వస్థత**

శ్రీకాళహస్తి, జూలై 13: పొలం గట్టుపై కనిపించిన ఆకును తోటకూరగా భావించారు. ఆపై ఇంటికి తెచ్చి తాళింపుగా చేసుకుని సభ్యులంతా తిన్నారు. ఆహారం విషపూరితమై వికటించడంతో నలుగురు మహిళలు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లెలో శనివారం చోటు చేసుకుంది. వీఎంపల్లెకు చెందిన రమణమ్మ(55), నిర్మల(50), శ్యామల(25), అమ్ములు(35) ఒకే కుటుంబ సభ్యులు. వీరంతా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. శనివారం కాలనీ సమీపంలోని పొలంగట్లపై తోటాకు తరహాలో ఆకు కనిపించింది. దానిని సేకరించుకుని ఇంటికి వచ్చి తాళింపు చేసుకుని అన్నంతో కలిసి తిన్నారు. సాయంత్రానికి నలుగురూ మతిస్థితిమితం కోల్పోయిన వారిలా ప్రవర్తించారు. ఇరుగుపొరుగు వారు గమనించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి అదుపు కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

మిల్లర్‌లో పడి మహిళ దుర్మరణం





మిల్లర్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రహీం రెడ్డి , ఇందిరమ్మ (ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 13 : భవన నిర్మాణ పనులకెళ్లిన ఓ మహిళ మిల్లర్‌లో చీర ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయిన విషాద ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం...చిట్టమూరు మండలం కుమ్మరిపాలెంకు చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ (45) శనివారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ భవన నిర్మాణానికి శ్లాబ్ పనికి వెళ్లింది. మిల్లర్‌లో సిమెంట్ కలవ కలుపుతుండగా పక్కనే ఆమె నీటితో చేతులను శుభ్రం చేసుకుంటోంది. ఇదే సమయంలో ఇందిరమ్మ చీర మిల్లర్‌కు తగులుకుంది. మిల్లర్ వెంటనే లాక్కోవడంతో ఆమె అందులో ఇరుక్కుపోయింది.తల మొండెం నుంచి తెగి పడిపోయింది. వెంటనే మిల్లర్‌ను నిలిపివేసి తోటి కూలీలు ఆమె మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్ఐ రహీం రెడ్డి ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు



షరీనా (ఫైల్‌ఫొటో)

డక్కిలి, జూలై 13 : జ్వరం బారిన పడిన ఓ విద్యార్థిని చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు వాసుదేవరావు, సురేష్, మణి, రవి, గద్దల మునెయ్య, సర్వేపల్లి రత్నయ్యలు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని షరీనా(9) కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోందన్నారు. కానీ పాఠశాల సిబ్బంది ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పలేదన్నారు. ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 12వ రాపూరులోని తల్లిదండ్రులు సమాచారమిచ్చి చేతులు దులుపుకొన్నారన్నారు. పది రోజులుగా అనారోగ్యంతో బాదపడటం వల్ల విద్యార్థిని శరీర అవయవాలు దెబ్బతిన్నాయని చెన్నై వైద్యులు చెప్పారన్నారు. ఇందుకు బాధ్యులైన పాఠశాల నర్సు, పీఈటీ టీచరు, హౌస్ టీచర్లతో పాటు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

రెవెన్యూ అధికారులు విచారణ

విద్యార్థి మృతి సంఘటనపై రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఆహార పదార్థాలు, తాగునీటి నాణ్యత వంటి అంశాలపై లోతుగా పరిశీలిచంచారు. ఉన్నతాధికారులకు వారు నివేదిక పంపనున్నారు. ఈ సంఘటనతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పాఠశాల్లో నీటినమూనాలు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టింది. ఈవోపీఆర్డీ శనివారం పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించారు. షరీనా మృతిపై ఉన్నతాధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సునీల్ డిమాండ్ చేశారు.

గుడిమల్లం ఆలయ చైర్మన్‌గా గిరి నాయుడు



ఏర్పేడు, జూలై 13: ప్రసిద్ధి గాంచిన గుడిమల్లం పరశు రామేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా బత్తల గిరి నాయుడు నియమితులయ్యారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని గిరి నాయుడికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శనివారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు, నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

తిరుమల క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసిన ఇద్దరిపై కేసు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఇద్దరి పై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనం కోసం నారాయణగిరి షెడ్‌లోని కంపార్టుమెంట్‌లో భక్తులు వేచివున్న సందర్భంలో ఓ యువకుడు తాళాలు తీస్తున్నట్టు నటించగా భక్తులందరూ తాళాలు తీస్తున్నారనే భ్రమలో పైకిలేచి గోవిందనామస్మరణలు చేశారు. ఈ లోగా ఆ యువకుడు వెకిలినవ్వులతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దృశ్యాలను 'టీటీఎఫ్ ఫ్యామిలీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో పోస్ట్ చేయగా, ఈ ప్రాంక్ వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయంలో 11వ తేదీన మీడియాలో రావడంతో టీటీడీ స్పందిస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టీటీడీ సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు టీటీఎఫ్ పేజ్‌ను నడుపుతున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన వి.వైకుంఠవాసన్, అతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామి అనే యువకులపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, ప్రాంక్ వీడియో చేసిన వ్యక్తుల కోసం ఓ బృందం తమిళనాడుకు వెళ్లింది. తొలత వైకుంఠవాసన్, గోవిందరాజస్వామిని అదుపులోకి తీసుకుని ఆ తర్వాత ప్రాంక్ వీడియో చేసిన మిగిలినవారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు భద్రతాధికారులు ప్రయత్నిస్తున్నారు.


వీడియోలో మాట్లాడుతున్న వాసన్

వీడియో తీసినందుకు క్షమించండి: వాసన్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియో ఉంటే తనను క్షమించాలంటూ ప్రాంక్ వీడియో పోస్ట్ చేసిన పేజ్ క్రియేటర్ వాసన్ శనివారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. తాను తన స్నేహితులతో కలిసి భక్తిభావంతోనే తిరుమలకు వచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలోకి ఫోన్ తీసుకెళ్లానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందు తమ సెల్‌ఫోన్లను డిపాజిట్ చేశామన్నారు. అయితే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందున్న నారాయణగిరి షెడ్లలో తమ స్నేహితులతో సరదాగా ఓ వీడియో చేశామని, ఈ వీడియో తప్పుగా ప్రజల్లోకి వెళ్లిపోయిందన్నారు. నిజానికి అది ప్రాంక్ కాదని, తాము కంపార్టుమెంట్లలో వేచిఉన్నప్పుడు కొందరు ఉద్యోగులు తాళాలు తీస్తున్నట్టు దగ్గరకు వచ్చి వెళ్లిపోయారని, దాన్నే తాము సరదాగా రీక్రియేట్ చేశామని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. ఈ వీడియో వల్ల ఎవరి మనసైనా కష్టపడి ఉంటే క్షమించాలని కోరాడు. కులాలు, మతాలపై తమకు ఆసక్తి లేదని, అందులో భాగంగానే ఇతర మతానికి చెందిన తనస్నేహితుడు అజీస్ కూడా స్వామి దర్శనానికి వచ్చాడని తెలిపాడు.

కడప మహిళ దారుణహత్య

గొంతుకోసిన గుర్తు తెలియని వ్యక్తి


రక్తపు మడుగులో రెడ్డెమ్మ మృతదేహం

తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ఒకరు తిరుపతిలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి బాలిరెడ్డి తన భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58), కుమార్తె గుర్రమ్మ(34)తో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించక పోవడంతో పాటు మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతికి చెందిన బి.మాలతికి చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేసి వారి వద్దనుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి తన వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటల ప్రాంతంలో కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడదూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్ద కొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లక పోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండటంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడ్డవారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి పంచాయతీ పరిధిలోని గంగిరెద్దులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మా చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చొని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.


రోదిస్తున్న గుర్రమ్మ

భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించండి

టీటీడీ అధికారులతో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్


అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నిరీక్షణ సమయాన్ని తగ్గించేదిశగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులకు ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయన తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావుతో కలిసి భక్తుల సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మారిన తర్వాత గత నెలరోజుల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు తీసుకున్న నిర్ణయాలు, అమలుచేస్తున్న విధానాలపై సీఎస్‌కు ఈవో వివరించారు.భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు టైం స్లాట్‌సర్వదర్శన టోకెన్ల జారీలో తీసుకోబోతున్న నిర్ణయాలను, ఐటీ విభాగం ద్వారా చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలను ఈవో వివరించారు. తిరుమలలో పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల్లో నాణ్యత పెంపు కోసం చేస్తున్న మార్పులను సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నిర్ణయాలను అభినందించిన సీఎస్ తిరుమలలో భక్తులకు మంచి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. రోజుకు ఎంతమంది దర్శనానికి వస్తున్నారు, ఎలాంటి దర్శన పద్ధతులున్నాయి వంటి విషయాలపై ఆరా తీశారు. అలాగే సౌకర్యాల కల్పనపై కొన్ని సూచనలు చేశారు.

పాముల్ని వదిలేసి చీమలపై ప్రతాపమా?

విజిలెన్స్ విచారణలపై టీటీడీ ఉద్యోగుల ఆందోళన

తిరుపతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి):గత పాలకమండలి లో నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించకుండా విజిలెన్స్ విచారణ పేరుతో తమను ఇబ్బంది పెడుతున్నారని టీటీడీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.వాళ్లు తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే వాళ్లను వేధించడం సబబు కాదంటున్నారు.పాపాలకు కారకులైన పాముల జోలికి వెళ్లకుండా చీమలను విచారణల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. పలానా నిర్మాణ పనులు ఎందుకు చేస్తున్నారు, ఆ కాంట్రాక్టర్లకు చెక్కులు ఎందుకు ఇచ్చారు, అంటూ తామేదో తప్పు చేసినట్టు అడిగిన ప్రశ్నలనే అడుగుతున్నారని ఈవో శ్యామలరావు దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. టీటీడీ నిర్వహణలో వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు మాజీ ఈవో ధర్మారెడ్డి, మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అక్రమాలకు తెగబడ్డారని, సాంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకున్నారని ఎన్డీఏ నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే.బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా సివిల్ కాంట్రాక్టులకు టీటీడీ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. వారిద్దరిపై సీబీ సీఐడీ లేదా విజిలెన్స్ విభాగాలతో విచారణ జరిపి అక్రమాలు వెలికి తీయాలని ఇటీవల పలుదఫాలుగా ఫిర్యాదులు చేశారు. శ్రీవారిని దర్శించుకునే బడా పారిశ్రామికవేత్తలతో, వ్యాపారవేత్తలతో తనకున్న పరిచయాలను దుర్వినియోగం చేస్తూ ఎన్నికల సమయంలో వైసీపీకి విరాళాల సేకరణకు మార్గంగా ధర్మారెడ్డి వ్యవహరించారని ఆరోపణలు చేశారు. తిరుమలలో అతిథి గృహాలకు భూముల కేటాయింపులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదని, ఫర్నిచర్ మార్పు పేరిట రూ. కోట్లు దారి మళ్ళించారని ప్రస్తావించారు. ధర్మారెడ్డి మొబైల్ ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తే జగన్‌రెడ్డిని క్రిమినల్ కేసుల నుంచీ కాపాడేందుకు ఢిల్లీలో ఆయన రాయబారాలు స్పష్టంగా వెల్లడవుతాయని పేర్కొన్నారు.ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వారం రోజులుగా ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో టీటీడీ ఉద్యోగులను విచారిస్తున్నారు. అయితే గత పాలకమండలి పెద్దలను విచారించకుండా తమదగ్గరకు రావడం ఏమిటని వారు ఈవో దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

తిరుపతిలో ఎన్నడూ జరగని అభివృద్ధి చేసి చూపిస్తా: ఆరణి

చిత్తూరు సిటీ, జూలై 13: తిరుపతిలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చేసి చూపిస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శనివారం చిత్తూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమలోనే అత్యధికంగా 63 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో తిరుపతిని అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. 16వ తేదీన ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈక్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో వీఐపీ బ్రేక్ దర్శనాలకు 15వ తేదీన ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

హుండీ ఆదాయం రూ.4.69 కోట్లు

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.69 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 63,493 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,676 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో డీఈవో పోస్టుకు 20న ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), జూలై 13: స్విమ్స్ వైరాలజీ విభాగంలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) పోస్టుకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు 35 ఏళ్ల లోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో 20తేదీ ఉదయం 8 గంటలకు స్విమ్స్ కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 13: రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పరుగులు పెడుతున్నాయని కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత ఊట్ల సురేంద్ర నాయుడు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ఇచ్చిన హామీలపై విశ్వసించి గెలిపించినందుకు నెల రోజుల్లోనే ప్రధాన సమస్యలు పరిష్కరించారని చెప్పారు. ప్రధానంగా ఇసుక అందుబాటులోకి తేవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆగస్టు 15వ తేదీనుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. ఇక తిరుపతి, తిరుమలలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రక్షాళన చేయడానికి ముఖ్యమంత్రి కార్యాచరణ రూపొందిస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు శ్రీరాములు, నాగప్రతాప్, ఉదయ్, ధనంజయ్, చంద్ర పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో షిరూర్ మఠాధిపతి



తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉడిపి షిరూర్ మఠాధిపతి వేదవర్ధనతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో మహద్వారం వద్దకు చేరుకున్న ఆయనకు జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాద)తో స్వాగతం పలికారు. కాగా, వెంకన్నను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, తెలంగాణ ఎంపీ బలరామనాయక్, ఎమ్మెల్సీలు రఘోత్తమరెడ్డి, విఠల్‌దండే, కర్ణాటక ఎంపీ తేజస్వీసూర్య ఉన్నారు. ఆకేపాటి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. విఠల్ దండే మాట్లాడుతూ.. స్వామి ఆశీస్సులతో తెలంగాణతోపాటు ఏపీలోనూ మంచి పరిపాలన జరుగుతోందన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పడకలు వందకు పెంచాలి


పద్మావతికి శుభాకాంక్షలు తెలుపుతున్న రత్నకుమార్

మంగళం, జూలై 13: ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఉన్న 50 పడకలను వంద పడకలకు పెంచాలని సెంట్రల్ లేబర్ బోర్డు సభ్యుడు లేబూరు రత్నకుమార్ కోరారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పద్మావతి నియమితులైన సందర్భంగా శనివారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ కోశాధికారి శ్రీనివాసులు, తిరుపతి రూరల్ మండల కార్యదర్శి గోపీనాథ్, స్విమ్స్ ఈఎస్‌ఐ నర్సెస్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ థొరాసిక్ సర్జరీలు


డాక్టర్ అజయ్ నరసింహన్

తిరుపతి(వైద్యం), జూలై 13: దేశంలోనే తొలిసారిగా చెన్నై అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ థొరాసిక్ సర్జరీలు ప్రారంభించినట్లు ఆ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అజయ్ నరసింహన్ అన్నారు. లక్ష్మీపురంలోని అపోలో ఆస్పత్రిలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ విధానంతో నిమిషాల వ్యవధిలోనే సర్జరీలు సులువుగా పూర్తి చేయడంతోపాటు రోగులు ఎక్కువకాలం పడకపై విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. అలాగే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కూడా ఈ విధానంలో సర్జరీలను సులువుగా చేస్తున్నామని, సక్సెస్ రేటు నూటికి నూరు శాతం ఉందని చెప్పారు. తక్కువ ఖర్చులోనే ఇటువంటి సర్జరీలను తమ ఆస్పత్రుల్లో చేసుకోవచ్చన్నారు.

'బహుదూరపు బాటసారి' పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), జూలై 13: అధ్యాపకులు రేపటి సమాజ రూపశిల్పులని ఎస్వీయూ పూర్వ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి అన్నారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆఫీసర్ క్లబ్‌లో జరిగిన బహుదూరపు బాటసారి పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పదవీ విరమణ చేసిన డాక్టర్ సి.సుకుమార్ రెడ్డి తాత్విక చింతనతో ఈ పుస్తకం రచించినట్లు తెలిపారు. రచయిత అధ్యాపకుడిగా చేసిన సేవలను, వ్యక్తిత్వం గురించి టీటీడీ పూర్వ విద్యాధికారి భాస్కరరెడ్డి, సాహితీవేత్తలు సాకం నాగరాజు, ఎ.గంగాధర రెడ్డి తెలియజేశారు. పుస్తకాన్ని ఆకాశవాణి విశ్రాంత అధికారి ఎ.మల్లేశ్వరరావు సమీక్షించారు. చివరగా రచయిత తన స్పందన తెలియజేశారు. ప్రముఖ గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ప్రార్థనా గీతంతో మొదలైన సభకు తమటం రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు, నగర ప్రముఖులు జి.శ్రీనివాసులు రెడ్డి, నాదెళ్ల శ్రీమన్నారాయణ, టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, గుండాల గోపీనాథ్ రెడ్డి, మన్యం నరశింహులు పాల్గొన్నారు.

నేడు సంకటవజ్ర వారాహి హోమం

రామచంద్రాపురం, జూలై 13: రాయలచెరువుకట్ట కింద ఉన్న భవానీజలకంఠేశ్వరాలయం వద్ద ఆదివారం రాత్రి సంకట వజ్ర వారాహి హోమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనేవారికి హోమద్రవ్యాలను ఉచితంగా అందిస్తారు. రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని నిర్వాహకులు పేర్కొన్నారు.


ప్రముఖుల ఆత్మీయ పలకరింపులో భాగంగా టీడీపీ నాయకుడు కొల్లూరి ఇందుశేఖర్ ఇంటికెళ్లి సన్మానించిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు

వివాదాల 'మూర్తి'

పీఏగా తెచ్చుకున్న ఆరణి

తిరుపతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి):వివాదాలకు పేరుగాంచిన మూర్తి అనే వ్యక్తిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పీఏ (వ్యక్తిగత సహాయకుడు)గా తెచ్చిపెట్టుకోవడం చర్చనీయాంశమైంది. పంచాయతీరాజ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మూర్తి గతంలో వైసీపీకి చెందిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి దగ్గర పీఏగా పనిచేశారు. అప్పట్లో ఆ నియోజకవర్గంలో జరిగిన అనేక అక్రమ రెవెన్యూ వ్యవహారాల్లో కేంద్రబిందువయ్యారన్న ఆరోపణలున్నాయి.వైసీపీతో అంటకాగిన వారిని దూరం పెట్టాలన్న కూటమి అగ్రనేతల ఆదేశాలను కూడా పక్కన పెట్టి మూర్తిని తీసుకొచ్చి పీఏగా పెట్టుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేని కలిసేందుకు వచ్చే కూటమి నేతల కన్నా వైసీపీతో దగ్గరసంబంధాలున్నవారికే ప్రాధాన్యం ఇస్తారన్న విమర్శలున్నాయి.అలాంటి వ్యక్తిని ఆరణి శ్రీనివాసులు తిరుపతికి తీసుకురావడంపై కూటమి పార్టీల్లో అసంతృప్తులు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అన్నమయ్య సంకీర్తనల పరిష్కారానికి చర్యలు : ఈవో


తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 32వేల సంకీర్తనలు రచించారన్నారు. వీటిల్లో ఇంకా అపరిష్కృతంగా ఉన్న సంకీర్తనలను పరిష్కరించి జనబాహుళ్యంలోకి తీసుకురావాలి' అని అధికారులను టీటీడీ ఈవో శ్యామలరావు కోరారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ ఆల్‌ప్రాజెక్ట్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇంకా ఎన్ని కీర్తనలు పరిష్కరించాలి, దీనికెంత సమయం పడుతుంది అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, నాలాయర దివ్యప్రబంధ ప్రాజెక్ట్, శ్రీనివాస కల్యాణం, వైభవోత్సవాల ప్రాజెక్ట్, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ, ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్, పురాణ ఇతిహాస ప్రాజెక్ట్, వెంగమాంబ ప్రాజెక్ట్, సారంగపాణి ప్రాజెక్ట్, టీటీడీ ప్రచురణల విభాగంపై సంబంధిత అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరాలను తెలియజేశారు. జేఈవో గౌతమి, హెచ్‌డీపీపీ ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, అన్నమయ్య ప్రాజెక్ట్ సంచాలకుడు విభీషణశర్మ, సంబంధిత ప్రాజెక్ట్‌ల అధికారులు పాల్గొన్నారు.

బల్క్‌గా టోకెన్లు, టికెట్లు బుక్ చేసే నెంబర్లు, మెయిల్ ఐడీల బ్లాక్

దళారుల బెడద లేకుండా టీటీడీ చర్యలు

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తులకు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు టీటీడీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.భక్తులకు ఆఫ్‌లైన్(కౌంటర్ సేవలు), ఆన్‌లైన్(వెబ్ పోర్టల్) ద్వారా టీటీడీ అందించే సేవలకు కొంతమంది దళారులు భక్తులను మోసం చేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏడాదికాలంలో ఆన్‌లైన్‌లో రూ.300 దర్శనం, డిప్, వసతి, ఆర్జితసేవలు, వర్చువల్ సేవలు, ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డీ టోకెన్లు, వసతి తదితర సేవల బుకింగ్‌పై ఇటీవల టీటీడీ విచారణ జరిపింది. ఇందులో ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి మధ్యవర్తులు బల్క్‌గా టికెట్లు బుక్ చేసినట్టు విచారణలో తేలింది. ఒకే మొబైల్ నెంబరుతో 122 గదులు పొందినట్టు బయటపడింది. అలాగే ఆన్‌లైన్ బుకింగ్‌లో ఒకే నెంబరును ఉపయోగించి 807 వసతి గదులు, ఒకే మెయిల్ ఐడీ ద్వారా 926 గదులు పొందినట్టు తేలింది. ఇక, ఒకే నెంబరు ద్వారా ఏడాదిలో 1,279 డిప్ రిజిస్ట్రేషన్లు, ఒకే మెయిల్ ద్వారా 48 డిప్ రిజిస్ట్రేషన్లు, ఒకే ఐడీ ప్రూఫ్‌తో 14 ఎస్ఎస్‌డీ సర్వదర్శన టోకెన్లు పొందినట్టు విచారణలో వెలుగుచూసింది. దీంతో బల్క్‌బుకింగ్‌కు ఉపయోగించిన నెంబర్లు, మెయిల్ ఐడీ, గుర్తింపుకార్డులను బ్లాక్ చేశారు.బుక్ చేసిన సేవలను కూడా రద్దు చేశారు. ఆ సేవలను రద్దు చేసినట్టు రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు తెలియజేయనున్నారు. నిజమైన భక్తులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టీటీడీ కార్యచరణ రూపొందిస్తోంది. సరైన ధృవీకరణ కోసం ఆధార్ సేవలను ఉపయోగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

భక్తురాలికి టీటీడీ ఆర్థిక సాయం చేయాలి : బీజేపీ


స్విమ్స్‌లో ఉమను పరామర్శిస్తున్న భాను ప్రకాష్‌రెడ్డి తదితరులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 13: తిరుమలలో చెట్టుకొమ్మ విరిగిపడి గాయపడ్డ శ్రీవారి భక్తురాలు ఉమకు టీటీడీ ఆర్థికంగా సాయం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల జపాలి తీర్థంలో ఓ చెట్టుకొమ్మ విరిగిపడటంతో బెంగళూరుకు చెందిన ఉమ తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి టీటీడీ తరలించింది. శనివారం ఉమను బీజేపీ నాయకులు పరామర్శించారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఆర్థికం సాయం అందజేయాలని జేఈవో గౌతమిని అభ్యర్థించామని భానుప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా స్విమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడారని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారని చెప్పారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు: కురుగొండ్ల



వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూలై 13: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన వెంకటగిరి, బాలాయపల్లి వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల నుంచి ఫిర్యాదు అందితే వెంటనే స్పందిస్తామన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రుల సమస్యలు, అవసరమైన పరికరాలు, మందుల సరఫరా, సిబ్బంది కొరత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ తగదు



మాట్లాడుతున్న చిన్న

గూడూరు అర్బన్, జూలై 13: నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు చిన్నా కోరారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో శనివారం సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు సెలవు దినాలలో తరగతులను నిర్వహిస్తూ నిబంధనలను పాటించడంలేదన్నారు. దీనివల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జయకృష్ణ, శివ, లోకేష్, నజీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి వేలం పాట వాయిదా



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్, జూలై 13 : శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయ భూమికి శనివారం వేలం పాట నిర్వహించారు. నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపాన ఆలయాలకు సంబంధించిన కాంప్లెక్స్ వెనుక 60 సెంట్ల భూమికి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విన్నమాల ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. గతేడాది పాడిన వ్యక్తి నగదు చెల్లించకపోవడంతో పాట నిర్వహించాల్సి వచ్చిందని ఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. అయితే గత ఏడాదివచ్చిన హెచ్‌పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 13: కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకి సేవ జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి అభిషేకాలు



కోట, జూలై 13 : నెల్లూరుపల్లి కొత్త పాళెం, గోవిందపల్లి, చిట్టేడు, శ్రీలక్ష్మమ్మ కాలనీల్లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. విశేష అలంకరణ చేశారు. శ్రీలక్ష్మమ్మకాలనీలో ఆలయ ప్రధానార్చకులు సాయిబాబా ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది. భక్తులు విశేష పూజలు చేశారు.

గూడూరు కుటుంబాన్ని కలిసిన చిదానందస్వామి



ప్రభావతమ్మకు చిత్రపటాన్ని అందజేస్తున్న చిదానందస్వామి

నాయుడుపేట, జూలై 13 : కర్ణాటకకు చెందిన శక్తి సంప్రదాయ కలికి ఆశ్రమం నుంచి చిదానందస్వామి విజయవాడకు వెళ్తూ మార్గ మధ్యలో నాయుడుపేటలోని గూడూరు కుటుంబ సభ్యులను శనివారం కలిశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దివంగత గూడూరు రఘునాథరెడ్డి భార్య, నాయుడుపేట మాజీ సర్పంచ్ ప్రభావతమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. కలికి స్వాముల చిత్రపటాన్ని అందజేశారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, సాహిత్య, జేయకృష్ణలు ఉన్నారు.

పంచాయతీలకు విధుల విడుదలపై హర్షం

పెళ్లకూరు, జూలై 13: ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయడంపట్ల సర్పంచుల సంఘ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘ నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పంచాయితీలకు నేరుగా నిధులు మంజూరు చేయడంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవకాశమేర్పడిందన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఫ్యాన్సీ షాపులో భారీ అగ్నిప్రమాదం

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం ● రూ.కోటి మేర ఆస్తినష్టం



దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు - దుకాణం నుంచి వస్తున్న పొగలు



గూడూరు, జూలై 13: గూడూరు కుమ్మరవీధిలోని సూర్య ఫ్యాన్సీ, గిఫ్ట్ దుకాణంలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి దుకాణం గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తుల్లోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. మంటల సెగకు భవనం పగుళ్లిచ్చింది. ఉదయం 5:30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. గూడూరు,కోట, నాయుడుపేటలకు చెందిన మూడు ఫైర్‌ఇంజన్లను వినియోగించారు. రూ.కోటి మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. దట్టమైన పొగలతో స్థానికులు భయాందోళన చెందారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు అదుపులోకి వచ్చేవరకు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వ్యాపార సంస్థల ప్రాంతం కావడంతో దుకాణదారులు ఆందోళనలు చెందారు. అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని భావిస్తున్నామన్నారు. రూ.కోటి మేర ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారన్నారు. అగ్నిప్రమాదంపై ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విచారం వ్యక్తంచేశారు. దుకాణాన్ని పరిశీలించి యజమాని వేణుగోపాల్‌తో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషిచేస్తానన్నారు. గూడూరులో మరో ఫైరింజన్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. దుకాణాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, జూలై 13 : తమ కుమార్తె కనబడటం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు. అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన ఓ యువతి కొద్ది నెలల క్రితం శ్రీసిటీలోని డైకిన్ పరిశ్రమలో చేరింది. కొండూరు హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన యువకుడితో సన్నిహితంగా మెలుగుతుందని సమాచారం. ఈ నెల 3 నుంచి ఫోన్ చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది శుక్రవారం తడ వచ్చి విచారించారు. గత నెల 18 నుంచి తమ కుమార్తె విధులకు హాజరుకావడం లేదని తెలుసుకుని వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చినుకు పడితే ఈ రహదారిలో రాకపోకలు కష్టమే



అధ్వానంగా శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు

నాయుడుపేట, జూలై 13 : కొద్దిపాటి చినుకులకే శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు చిన్నపాటి నీటి మడుగులా తయారవుతుంది. ఈ రహదారి నాయుడుపేట నడిబొడ్డున ఉండటంతో స్థానికులే కాకుండా పరిసర ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక మేనకూరు సెజ్‌కు వెళ్లేందుకు ఇదే రహదారి. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తూపోతు ఉంటాయి. ప్రాధాన్యత కలిగిన ఈ ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నా, ప్రజలు అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలకు పాముల బెడద

కోట, జూలై 13 : కోటలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ఈ ఆవరణలో పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పగలు సైతం ఆయా విషసర్పాలు కార్యాలయాలలోకి రావడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. వివిధ సమస్యలపై మండల పరిషత్, తహసీల్దారు, ఎంఈవో, వెలుగు కార్యాలయాలకు రావాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విచ్చలవిడిగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు ఇందుకు కారణమవుతున్నాయి. వీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

గురుకులాల్లో గ్యాస్ సమస్య

కోట, జూలై 13 : అంబేడ్కర్ గురుకులాలకు నెలల తరబడి వంట గ్యాస్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో భోజనాలు వండిపెట్టలేకపోతున్నామని వంట తయారీదారులు చెబుతున్నారు ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 6 బాలుర, 4 బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలున్నాయి. వీటికి సమీప గ్యాస్ ఏజెన్సీల ద్వారా నెలకు 60 సిలిండర్లను ప్రభుత్వ సరఫరాచేస్తుంది. గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ల సరఫరాను నిలిపివేసినట్లు సమాచారం. కోట, వాకాడు, చిల్లకూరు, తదితర మండలాల గురుకులాల ప్రిన్సిపాళ్లు సొంత నిధులతో సిలిండర్లు తెప్పిస్తున్నారు. అదనపు భారాన్ని మోయలేమంటూ వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని పాఠశాల వర్గాలు కోరుతున్నాయి.

కడప మహిళ దారుణహత్య

గొంతుకోసిన గుర్తు తెలియని వ్యక్తి





రెడ్డెమ్మ మృతదేహం

తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ఒకరు తిరుపతిలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి బాలిరెడ్డి తన భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58), కుమార్తె గుర్రమ్మ(34)తో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించకపోవడంతోపాటు మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతికి చెందిన బి.మాలతికి చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేసి వారి వద్దనుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి తన వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటల ప్రాంతంలో కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడ దూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్దకొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లక పోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండటంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడ్డవారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి పంచాయతీ పరిధిలోని గంగిరెద్దులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మా చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చొని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.

మామిడితోటలో పురాతన కట్టడాల రాళ్లు

చంద్రగిరి కోట ప్రహరీ ఆవరణలో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ వైనం - పనులు ఆపించిన ఆర్కియాలజీ అధికారులు





మామిడి తోటను చదును చేస్తుండగా బయటపడ్డ రాళ్లు

చంద్రగిరి, జూలై 13: చంద్రగిరి కోట ప్రహరీ ఆవరణలోని ఓ మామిడితోటలో పురాతన కట్టడాల రాళ్లు బయటపడ్డాయి. చంద్రగిరికి చెందిన ఓ రైతు తన మామిడి తోటను ఎక్స్‌కవేటర్ పెట్టి చదును చేస్తుండగా ఈ రాళ్లు బయటపడ్డాయి. వాటిని ఆయన కోట ప్రహరీ వెలుపల పడేశాడు. సమాచారం అందుకున్న ఆర్కియాలజీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను ఆపించారు. రాళ్లను పరిశీలించారు. కాగా, ఆర్కియాలజీ నిబంధనల ప్రకారం కోట ప్రహరీ చుట్టుపక్కల 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి తవ్వకాలు, పనులు చేపట్టకూడదు. అయితే కోట ప్రహరీ ఆవరణలోనే యథేచ్ఛగా యంత్రాలతో పనులు చేయడం, కట్టడాల నిర్మాణం జరుగుతున్నాయి. ఇకనైనా వీటిని అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

చంద్రగిరి కోట ప్రహరీ ఆవరణలో చంద్రగిరి ముస్లిం రైతుకు చెందిన ఓ మామిడి తోటలో చెట్లు నాటుకోవడానికి అనుమతి ఉంది. తోటలో చదును చేస్తుండగా పురాతన కట్టడాల రాళ్లు బయటపడ్డాయి.మాకు సమాచారం అందగానే పనులు ఆపించాం. ఈవిషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి.. తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- ప్రవీణ్ కుమార్, సీఏ (కన్జర్వేటర్ అసిస్టెంట్), చంద్రగిరి కోట

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు



షరీనా (ఫైల్‌ఫోటో)



ఫిర్యాదుచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డక్కిలి, జూలై 13 : జ్వరం బారిన పడిన ఓ విద్యార్థిని చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు వాసుదేవరావు, సురేష్, మణి, రవి, గద్దల మునెయ్య, సర్వేపల్లి రత్నయ్యలు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని షరీనా(9) కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోందన్నారు. కానీ పాఠశాల సిబ్బంది ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పలేదన్నారు. ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 12వ రాపూరులోని తల్లిదండ్రులు సమాచారమిచ్చి చేతులు దులుపుకొన్నారన్నారు. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడటం వల్ల విద్యార్థిని శరీర అవయవాలు దెబ్బతిన్నాయని చెన్నై వైద్యులు చెప్పారన్నారు. ఇందుకు బాధ్యులైన పాఠశాల నర్సు, పీఈటీ టీచరు, హౌస్ టీచర్లతో పాటు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

రెవెన్యూ అధికారులు విచారణ

విద్యార్థి మృతి సంఘటనపై రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఆహార పదార్థాలు, తాగునీటి నాణ్యత వంటి అంశాలపై లోతుగా పరిశీలిచంచారు. ఉన్నతాధికారులకు వారు నివేదిక పంపనున్నారు. ఈ సంఘటనతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పాఠశాల్లో నీటినమూనాలు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టింది. ఈవోపీఆర్‌డీ శనివారం పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించారు. షరీనా మృతిపై ఉన్నతాధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సునీల్ డిమాండ్ చేశారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాల పేట, జూలై 13: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వా లంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీదుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు.

శ్రీవిద్య కళాశాలలో కొత్త కోర్సులు

పుత్తూరు టౌన్, జూలై 13: పుత్తూరు మండలంలోని శ్రీవిద్య కళాశాలలో ఎంసీఏ, బీసీఏ డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ, ఎంబీఏ మేనేజ్‌మెంట్ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి మంజూరు అయినట్లు చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ తెలిపారు.

ఎర్ర చందనం స్వాధీనం: ఒకరి అరెస్టు



ఎర్రచందనం దుంగలు, నిందితుడితో అటవీశాఖ అధికారులు

పుత్తూరు అర్బన్, జూలై 13: ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒకరిని అరెస్టు చేసిన సంఘటన పుత్తూరు మండల పరిధిలో జరిగింది. ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి కథనం మేరకు వివరాలిలా.... మండల పరిధిలోని నేసనూరు పంచాయతీ, ద్వారకానగరం వద్ద ఉన్న మామిడి తోటలో ఎర్రచందనం దుంగలను నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు శనివారం ఉదయం దాడులు చేశారు. మామిడి తోటలోని ఒక కాల్వలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ.4 లక్షల విలువైన 32 ఎర్రచందనం దుంగలు దొరికాయి. అక్కడే తచ్చాడుతున్న నేసనూరుకు చెందిన చెంగారెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా సదాశివకోన నుంచి ఎర్రచందనం దుంగలను తీసుకువచ్చినట్లు వెల్లడించాడు. మండల పరిధిలోని ద్వారకానగర్‌కు చెందిన కృష్ణారెడ్డి, మొగిమల్లకాలనీకి చెందిన శంకర్ ఎర్రచందనం తరలింపులో తనకు సహకరించినట్లు తెలిపాడు. ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నిందితుడు కృష్ణారెడ్డిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు రేంజర్ మాధవి వివరించారు. కాగా, నిందితుడు చెంగారెడ్డిపై ఇదివరకే పుత్తూరు రేంజ్, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పరిధిలో కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నట్లు చెప్పారు. ఈదాడుల్లో సెక్షన్ ఆఫీసర్ లోకేష్, బీటు ఆఫీసర్లు అఫ్జల్, నాగయ్య, కుమారస్వామి, బేస్ క్యాంప్ సిబ్బంది రవి, అజయ్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం



ఆలయంలో ఎమ్మెల్యే ఆదిమూలం

పుత్తూరు అర్బన్, జూలై 13: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిస్తే స్వామివారి ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పిస్తామని ఆయన శ్రేయోభిలాషులు మొక్కుకున్నారు. వారి ఆహ్వానం మేరకు స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆదిమూలానికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో లక్ష్మణరాజు, రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, బాబూరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో 8మంది అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 13: ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో ఒక యువతి సహా మరో ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... తిరుపతికి చెందిన కృష్ణమూర్తి ఎన్‌ఆర్‌ఐ. ప్రైవేటు సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఆయనకు తిరుపతికి చెందిన ఆయేషా అనే యువతితో పరిచయం ఏర్పడింది. కొందరు మహిళలను సభ్యులుగా చేర్పిస్తామని ఆయేషా చెప్పడంతో కృష్ణమూర్తి ఆమెతో పాటు ఈనెల 3వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు వెళ్లారు. అక్కడ ఆయేషా, మరి కొందరు యువకులతో కలిసి కృష్ణమూర్తి కంట్లో కారం కొట్టి కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. అతని వద్ద నుంచి రూ.5లక్షల నగదు వసూలు చేశారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి రూ.6కోట్లు డిమాండ్ చేశారు. డబ్బు రాకపోవడంతో మరుసటిరోజు 4వ తేదీన కృష్ణమూర్తిని రాజీవ్‌నగర్‌లో వదలి వెళ్లిపోయారు. 8వ తేదీన కృష్ణమూర్తి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఆయేషానే కిడ్నాప్ పథకం రచించినట్లుగా నిర్ధారించుకుని ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగస్వాములు అయిన న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్డపూడి దాము, బంజల లోకేష్, పిడతల గిరి, యాసారపు భార్గవ్, వెట్టి అనిల్ అనే యువకులను శనివారం అరెస్టు చేశారు. ఆయేషా పాటు మొత్తం 8మంది నిందితులను రిమాండ్‌కు తరిలించనట్లు సీఐ రారాజు తెలిపారు.

ఆహారం వికటించడంతో నలుగురికి అస్వస్థత

పొలంగట్టుపై ఆకులను తాళింపుగా చేసుకుని...

శ్రీకాళహస్తి, జూలై 13: పొలం గట్టుపై కనిపించిన ఆకును తోటకూరగా భావించారు. ఆపై ఇంటికి తెచ్చి తాళింపుగా చేసుకుని సభ్యులంతా తిన్నారు. ఆహారం విషపూరితమై వికటించడంతో నలుగురు మహిళలు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎం పల్లెలో శనివారం చోటు చేసుకుంది. వీఎంపల్లెకు చెందిన రమణమ్మ(55), నిర్మల(50), శ్యామల(25), అమ్ములు(35) ఒకే కుటుంబ సభ్యులు. వీరంతా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. శనివారం కాలనీ సమీపంలోని పొలంగట్లపై తోటాకు తరహాలో ఆకు కనిపించింది. దానిని సేకరించుకుని ఇంటికి వచ్చి తాళింపు చేసుకుని అన్నంతో కలిసి తిన్నారు. సాయంత్రానికి నలుగురూ మతిస్థిమితం కోల్పోయిన వారిలా ప్రవర్తించారు. ఇరుగుపొరుగు వారు గమనించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి అదుపు కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వంతెనపై ప్రమాదకరంగా ఇనుపకడ్డీలు



వంతెనపై విరిగిన ఇనుప కడ్డీలు

శ్రీకాళహస్తి, జూలై 13: శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన పక్కన నిర్మించిన కొత్త వంతెనపై ఇనుపకడ్డీలు ప్రమాదకరంగా మారాయి. 11 ఏళ్ల క్రితం పట్టణంలోని స్వర్ణముఖినదిపై రామసేతు వంతెన పక్కన కొత్త వంతెనను నిర్మించారు. వంతెన మధ్యలో పలు చోట్ల ఇనుపకడ్డీలను ఏర్పాటు చేశారు. ఇటీవల అవి పలుచోట్ల విరిగిపోయాయి. మరికొన్ని చోట్ల విరిగిన కడ్డీలు తొలగిపోయాయి. వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో ఇనుపకడ్డీలు తరచూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. ముఖ్యంగా పాదాచారులు, సైక్లిస్టులు రాకపోకలు సాగించే సమయంలో కడ్డీలు తగులుకుని పలువురు గాయపడ్డారు. ఈ వంతెన పక్కనే జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉండడంతో రోజూ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఇనుప కడ్డీలను సరిచేయాల్సిన అవసరం ఉంది.

బాలుర వసతిగృహాన్ని తెరిపించండి

కేవీబీపురం, జూలై 13: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గత నాలుగేళ్ల క్రితం విద్యార్థులు లేకపోవడంతో అధికారులు ఈ వసతిగృహాన్ని మూసివేశారు. గత ఏప్రిల్ నెల 18న ఎంపీ గురుమూర్తి కొబ్బరికాయ కొట్టి హాస్టల్‌ను ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి హాస్టల్ మూతపడే ఉంది. దూర ప్రాంతాల నుంచి ఆదర్శ పాఠశాలకు వచ్చే విద్యార్థులు వసతిగృహ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వసతిగృహాన్ని తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయంలో విరిగిన చెట్టుకొమ్మ తప్పిన ప్రమాదం

శ్రీకాళహస్తి, జూలై 13: ముక్కంటి ఆలయంలోని భారీ వృక్షం నుంచి చెట్టుకొమ్మ విరిగిపడింది. ఆలయం లోపల చుక్కాని ఉత్సవం నిర్వహించే ప్రదేశంలో ప్రాకారం వద్ద భారీ చెట్టు ఉంది. శనివారం వేకువజామున హోరుగాలి, జోరువానతో భారీ కొమ్మ విరిగి ఆలయం వెలుపల వైపున పార్కింగ్ ప్రదేశంలో పడింది. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సన్నిధివీధిలో ట్రాఫిక్ ఇక్కట్లు



శ్రీకాళహస్తి, జూలై 13: శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సన్నిధి వీధిలో శనివారం భక్తులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరుస సెలవులతో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సన్నిధివీధిలోని జలవినాయక ఆలయం నుంచి టూరిస్టు బస్టాండు వరకు రోడ్డు ఇరుగ్గా ఉండడంతో వాహనాలు స్తంభించిపోయాయి. వాహనాలను జలవినాయక కూడలి వద్ద ఉన్న భక్తకన్నప్ప వంతెనపై పార్కింగ్ చేయించారు. దీంతో మరింతగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.

అడవిలో గుర్తు తెలియని మృతదేహం

సత్యవేడు, జూలై 14: సత్యవేడు మండలం మదనంబేడు అటవీప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో నాగాలమ్మ గుడి సమీపంలోని ఎగువ అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం మేకల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఉరివేసుకుని మృతి చెంది నెలరోజులకు పైగా అయివుంటుందని, ఎముకలు తేలి, పుర్రె మాత్రమే చెట్టుకు వేలాడుతున్నట్లు వారు తెలిపారు. పోలీసులు అటవీప్రాంతంలోకి వెళ్లి గాలించారు. అప్పటికే చీకటి పడడంతో సంఘటనా స్థలాన్ని గుర్తించలేక వెనుదిరిగారు.

వైభవంగా పాండవ విద్యాభ్యాసం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, జూలై 13: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శనివారం పాండవ విద్యాభ్యాసం వైభవంగా నిర్వహించారు. ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండవ విద్యాభ్యాసం తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. రాత్రి స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చారు.

చిచ్చురేపిన ఆస్తి వివాదం
ఒకరికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జూలై 13: ఆస్తి వివాదం చిచ్చురేపడంతో కుటుంబసభ్యుల మధ్య జరిగిన గొడవలో సుబ్బరాయులు(58) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వద్ద శనివారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన సుబ్బరాయులుకు నలుగురు సోదరులు, ఐదుగురు అక్కచెల్లెల్లు ఉన్నారు. వీరి కుటుంబంలో కొంతకాలంగా ఆస్తి విబేధాలు నెలకొన్నాయి. సుబ్బరాయులుకు ఓ సోదరుడితో శనివారం ఆస్తి విషయమై గొడవ జరిగింది. ఈ క్రమంలో తనపై కొందరు కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు సుబ్బరాయులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. అనంతరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్య

రేణిగుంట, జూలై 13: తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి కరకంబాడి పంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కరకంబాడిలో నివాసముంటున్న ఓ యువతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. స్థానికంగా ఉన్న ఓ యువకుడిని ప్రేమించడంతో తల్లిదండ్రులు మందలించారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రపోతుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సంద్రంగా ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 32వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,448మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,151మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,973మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,288, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 444మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 283మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 80మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 23,426 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గుడిమల్లం ఆలయ ఛైర్మన్‌గా గిరి నాయుడు



ఉత్తర్వుల కాపీని గిరినాయుడికి అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల

ఏర్పేడు, జూలై 13: ప్రసిద్ధి గాంచిన గుడిమల్లం పరశు రామేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా బత్తల గిరి నాయుడు నియమితులయ్యారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని గిరి నాయుడికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శనివారం సాయంత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు, నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల విడుదలపై సీఎంకు కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదం అందిస్తున్న చుక్కా ధనుంజయ యాదవ్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ.250 కోట్లు విడుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన సీఎం చంద్రబాబుకు సర్పంచ్ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ ఇతర ప్రతినిధులతో కలిసి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేర నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. బకాయి ఉన్న మిగతా నిధులు త్వరగా విడుదల చేయాలని ఆయన సీఎంను కోరారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి డేగల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూ తగాదాలో వృద్ధుడికి గాయాలు

రేణిగుంట, జూలై 13: భూ తగాదాతో జరిగిన దాడిలో వృద్ధుడికి గాయాలైన సంఘటన రేణిగుంట మండలం దిగువమల్లవరంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... దిగువ మల్లవరంలో ఓ స్థలం విషయమై అన్నదమ్ముల పిల్లలు మధ్య ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో తమ్ముడి కుమారుడు పెదనాన్నపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. బాధితుడు రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

సత్యవేడు, జూలై 13: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024- 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ కోరారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 2వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తుల స్వీకరణకు 10వ తేదీ వరకు గడువు విధించిందన్నారు. అయితే మళ్లీ 20వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. 23 నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపిక, 31న సీట్ల కేటాయింపు, ఆగస్టు 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. బీఏ హానర్స్ ఎకనామిక్స్‌లో 40 సీట్లు, బీకాం, కంప్యూటర్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీలో 50 సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, విద్యార్థులు నేరుగా వచ్చి వారి వివరాలను నమోదు చేయించుకోవచ్చన్నారు.

వికృతమాలలో వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వార్డు మెంబర్లు

ఏర్పేడు, జూలై 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో వికృతమాల పంచాయతీలో జరిగిన ఎన్నికల్లో 8మంది వార్డు మెంబర్లు గెలిచారు. వీరు టీడీపీ సానుభూతి పరులు కావడంతో ప్రమాణస్వీకారం చేయించలేదు. కక్షకట్టి పక్కన పెట్టారు. ఉపసర్పంచు ఎన్నిక సమయంలో కూడా వైసీపీ నాయకులు హైడ్రామా ఆడి తమ పార్టీకి చెందిన వారిని ఎన్నుకోవడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో స్థానిక టీడీపీ నాయకులతో కలసి వార్డు మెంబర్లు అడ్డుకోవడంతో చివరకు టీడీపీ మద్దతుదారు శివయ్యను ఉపసర్పంచుగా ఎన్నుకున్నారు. ఈక్రమంలో శనివారం 8మంది టీడీపీ వార్డు మెంబర్లు చేత పంచాయతీ కార్యదర్శి రోశయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీనాయుడు, హేమాక్షి రాయల్, జడ్పీటీసీ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ఏర్పేడు, జూలై 13: ఆరేళ్ల చిన్నారిపై లైంగిగ దాడిని నిరసిస్తూ ఆదివారం ఉదయం 10గంటలకు ఏర్పేడులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నేత వాసుదేవులు తెలిపారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



సమావేశమైన ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 13: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి విఘాతం కలిగిస్తున్న 117 జీవోను వెంటనే రద్దు చేయాన్నారు. పాఠశాల విలీన ప్రక్రియ రద్దు చేసి 1నుంచి 5 తరగతులు, 6 నుంచి 10 తరగతులకు ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బోధన చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అందేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వెంటనే పీఆర్సీకి కమిషన్ వేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. గత పీఆర్సీ కరువు భత్యం అరియర్స్‌ను ఉపాధ్యాయులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, హరి, గోపాల్, చంద్రారెడ్డి, హేమకుమార్, భువనేశ్వరి, చెంచురాజు, మునస్వామి, ఉదయ్‌కుమార్, వెంకటముని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించండి

ఏర్పేడు, జూలై 13: అన్నెం, పున్నెం ఎరుగని చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టేందుకు అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ పిలుపునిచ్చారు. గత ఆదివారం ఏర్పేడు మండలానికి చెందిన బలరామయ్యగౌడ్(61) ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.